www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 2 VOLUME : 2 | సంచిక: 5 ISSUE : 5 | సోమవారం, 25 మే, 2026 MONDAY, MAY 25, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
| --- | --- | --- | --- | --- | --- | --- |



## ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు

- ప్రయాణికుల భద్రతకు హైటెక్ రక్షణ కవచం
- 'బస్సులో భరోసా' పేరిట నిరంతర పర్యవేక్షణ
- ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

2



# అమెరికా-ఇరాన్ శాంతి మంత్రం!

- 60 రోజుల ఒప్పందానికి అమెరికా-ఇరాన్ దేశాల నిర్ణయం
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్న డొనాల్డ్ ట్రంప్
- శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకారం!
- 60 రోజులు హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధం
- ఆ సమయంలో అణు ఒప్పందంపై ఇరు దేశాల మధ్య తదుపరి చర్చలు
- అమెరికా మీడియా వెల్లడి.. స్పందించని ఇరాన్

**వాషింగ్టన్, మే 24:** అమెరికా- ఇరాన్ మధ్య శాశ్వత శాంతి సంధిపై కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. యుద్ధానికి పూర్తిగా ముగింపు పలికేందుకు ముందుగా 60 రోజుల కాలానికి తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకోవాలని రెండు దేశాలు నిర్ణయించినట్లు సమాచారం. ఈ కాల్పుల విరమణ ఒప్పందంపై ఎంవోయూ ఖరారైనట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా విస్తృత సంప్రదింపుల తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని శనివారం ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ, ఈజిప్ట్, ఖతార్, తుర్కియే, పాకిస్థాన్, జోర్డాన్, బహ్రెయిన్‌తో చర్చించిన తర్వాత ఈ ఒప్పందాన్ని ఖరారుచేసినట్లు వెల్లడించారు. అయితే ఈ విషయంలో తొందర పడబోమని ట్రంప్ అన్నారు. తనవద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు ఇచ్చేందుకు ఇరాన్ అంగీకరించిందని న్యూయార్క్ టైమ్స్ వార్తా సంస్థ తెలిపింది. ఈ తాత్కాలిక ఒప్పందం మిగతా 2లో..

## ధాన్యం కొనుగోళ్లు నెలాఖరుకు
# పూర్తవ్వాలి

- ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని 72 గంటల్లోగా కొనాలి
- తర్వాత వచ్చే ధాన్యానికి 10 రోజుల్లోగా చెల్లింపులు పూర్తవ్వాలి
- తడిసిన ధాన్యాన్ని కొని వెంటనే బాయిల్డు మిల్లులకు తరలించాలి
- రోజుకు 3లక్షల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకోవాలి
- ఇప్పటివరకు 51లక్షల టన్నులు కొన్నాం లక్ష్యం 75లక్షల టన్నులు
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు.. 10 రోజుల ప్రణాళిక ప్రకటన




**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే24:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరుకల్లా కొనుగో లు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఉత్తమ్‌కుమార్ ఆదివారం వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు ఉత్తమ్ 10 రోజుల ప్రణాళికను ప్రకటించారు. మార్కెట్ యార్డులకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల కు వచ్చిన 8.50లక్షల టన్నుల ధాన్యాన్ని 72 గంటల్లోగా కాంటా పూర్తి చేసి లోడ్ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే 16లక్షల ట న్నుల ధాన్యాన్ని 10 రోజు ల్లో కాంటా పూర్తి చేసి రైతులకు చెల్లింపులు చేయాలన్నారు. రో జుకు 3లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించా లని అధికారులకు టార్గెట్ పెట్టారు. ఇందుకో సం రాత్రి పూట కూడా ధాన్యం కొనుగోళ్లు జరగాలని, గోదాముల సామర్థ్యాన్ని 7లక్షల టన్నుల మేర పెంచుతున్నామని వెల్లడించారు. ఈ వర్చువల్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లాల కలెక్టర్లు, ఎంపీలు, మిగతా 2లో..

# ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర

- కేసుల భయంతోనే మోదీకి రేవంత్ సరెండర్
- వ్యవసాయం, ఇళ్లలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం
- ప్రజల్లో ఉండే వారికే కార్పొరేషన్ ఎన్నికల్లో అవకాశం
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే24:** 'కేసుల భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి సరెండర్ అయ్యాడు. అందుకే రాష్ట్రంలో ప్రీ పెయిడ్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును రద్దు చేసి అదానీ, అంబానీ వంటి ప్రీ పెయిడ్ సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు కాక ముందే కాంగ్రెస్ ఫ్యూజ్‌లు పీకేయాలి, అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 'నా బూతు.. నా భవిష్యత్తు' పేరిట అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్(సీఎం) కాదు... కటింగ్ మాస్టర్ (సీఎం) అని కేటీఆర్ దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో నిర్మాణం చేపట్టి పూర్తయిన వంతెనలు, భవనాలకు జేబులో కత్తెర పెట్టుకొని ప్రారరంభిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న కరెంటు మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు మిగతా 2లో..







# భానుడి భగభగలు

- ఎండవేడిమికి తాళలేక పిట్టల్లా రాలిపోతున్న జనం
- రోజూ పదుల సంఖ్యలో వడదెబ్బ మరణాలు నమోదు
- రాష్ట్రంలో నిన్న ఒక్కరోజే 42 మంది మృతి
- ఒక్క ఉమ్మడి వరంగల్‌లోనే ఆదివారం17 మంది మరణం
- ఉమ్మడి ఖమ్మంలో 10 మంది.. కరీంనగర్‌లో 8 మంది మృతి
- నల్లగొండ జిల్లాలో ఐదుగురి కన్నుమూత
- మూడు రోజుల్లో 100 మంది పైనే మృత్యువాత
- హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగానే..

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే24:** రాష్ట్రంలో భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎండవేడిమికి తాళలేక పిట్టల్లా రాలిపోతున్నారు. రోజూ పదుల సంఖ్యలో వడదెబ్బ మరణాలు నమోదవుతున్నాయి. గతకొద్ది రోజులుగా రాష్ట్రంలో రోజూ వడదెబ్బతో 30-40 మంది వరకు మరణిస్తున్నారు. ఆదివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 42 మంది వడదెబ్బతో మరణించారు. మరోవైపు వర్షాలు, పిడుగుపాట్లు కూడా ప్రాణాలు తీస్తున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు, సాయంత్రం కాగానే విపరీతమైన గాలివాన భీభత్సం సృష్టిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఉదయం 8-9 గంటల నుంచే మాడు పగిలే వేడి కనిపిస్తోంది. ఆదివారం రాష్ట్రంలో అనేకచోట్ల 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమొదయ్యాయి. సాయంత్రం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని మక్కలు, వడ్లు తడిసిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. జిల్లాలో ఆదివారం ఒక్కరోజే మిగతా 2లో..

## ప్రతి కుటుంబానికీ
# ఇందిరమ్మ బీమా

- కోటి 15లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- జూన్ 2 నుంచి ప్రారంభిస్తున్నాం: భట్టి విక్రమార్క
- పంటల కొనుగోళ్లపై స్పందించని కేంద్రం: తుమ్మల



**ఖమ్మం/హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే24:** రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి పేద, ధనిక, కుల, మతం అనే భేదం లేకుండా కోటి 15 లక్షల కుటుంబాలకి 'ఇందిరమ్మ బీమా పథకాన్ని' అమలు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకంలో అన్ని కుటుంబాలకు 5 లక్షల రూపాయల బీమాను వర్తింప జేస్తున్నామన్నారు. జూన్ 2వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించనున్నటు వెల్లడించారు. సుడా చైర్మన్‌గా ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ ఎండీ ఖాదర్‌బాబా పదవీ స్వీకారం చేపట్టిన సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి తుమ్మల తదితరులు పాల్గొ న్న ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల అవసరాల్ని పక్కన పెట్టి, కేవలం కేసీఆర్‌కి సంబంధించిన కుటుంబ మిగతా 2లో..




2 లో..

## పాకిస్థాన్ వస్తా.. ఉగ్రదాదుల్లో
# శిక్షణ ఇవ్వండి

సంపుటి: 2 సంచిక: 5 వార్త వేదిక సూర్య || సోమవారం, 25 మే, 2026 ||

# ధాన్యం కొనుగోళ్లు నెలాఖరుకు పూర్తవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 51లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఉత్తమ్‌కుమార్ తెలిపారు. ఇందుకు గాను రైతులకు రూ.8,749కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రం లో ప్రస్తుత సీజన్‌లో 141లక్షల టన్నుల వరిధాన్యం ఉత్పత్తి అయిందని, ఇందులో 75లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52లక్షల టన్నుల సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చిందని ఉత్తమ్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. తాలు, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, వెంటనే ఆ ధాన్యాన్ని బాయిల్డు మిల్లులకు తరలించాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, నారాయణపేట, ఖమ్మం జిల్లాలు ధాన్యం సేకరణలో ముందంజలో ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. కాగా, వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు ప్రచారాలను ఖండించాలని, రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్న విషయాన్ని ప్రజలకు చేరవేయాలని చేయాలని ఉత్తమ్ ఆదేశించారు.

**మహిళా సంక్షేమ వారంపై మంత్రి సీతక్క సమీక్ష**

ఉత్తమ్ సమీక్ష అనంతరం ఇదే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు శాఖకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న 'మహిళా సంక్షేమ వారం' పై చర్చించారు. గ్రామ,మండల స్థాయిలో ఇందిరా మహిళాశక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాలకు శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట– అంగన్వాడీ బాటపై కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, మంత్రివర్గంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ మీటర్లు వస్తే.. మొబైల్ ఫోన్ల తరహాలో ముందే రీ చార్జ్ చేసుకొని.. బ్యాలెన్స్ మేరకు విద్యుత్ వినియోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో కాంగ్రెస్ చేస్తోన్న కుట్రలపై ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మోదీ ఎంత ఒత్తిడి చేసినా.. రూ. 30 వేల కోట్ల రుణం రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా.. కేసీఆర్ ఎదురించారే తప్ప.. మీటర్లు పెట్టేందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అర్హుల ఓట్లు జాబితా నుంచి తొలగించకుండా జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ వాళ్లు కొందరి ఓట్లు తొలగించే కుట్ర చేస్తారని, వారితో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. డిసెంబరు లేదా జనవరిలో కార్పొరేషన్ల ఎన్నికలు ఉండే అవకాశముందన్నారు. ఎమ్మెల్యేలు, పెద్ద నాయకుల చుట్టూ తిరగకుండా ప్రజల్లో ఉండి.. వారి సమస్యలపై పోరాడిన, సభ్యత్వ నమోదులో కీలకంగా వ్యవహరించిన వారికి సర్వేల ఆధారంగా పార్టీ టికెట్ ఇస్తామని కేటీఆర్ చెప్పారు.

# ప్రతి కుటుంబానికీ 'ఇందిరమ్మ బీమా'

(మొదటి పేజీ తరువాయి)

అవసరాల కోసమే పనిచేశారని, ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. కాగా, కనీస మద్దతు ధరల ప్రకటనలకే కేంద్ర ప్రభుత్వం పరిమితమవుతున్నదని, పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై ఏమాత్రం స్పందించటంలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సర్దుబాటుచేసి కనీస మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉగ్రదాడుల్లో శిక్షణ ఇవ్వండి

**హైదరాబాద్/మేడ్చల్, (వార్త వేదిక సూర్య)-మే 24:**

తాను ఉగ్రవాదిగా మారతానని, ఉగ్రదాడులు చేయడంలో తనకు శిక్షణ ఇవ్వమని కోరుతూ... పాకిస్థాన్‌లోని టెర్రరిస్టు ముఠాలతో ఆన్‌లైన్‌లో చాటింగ్ చేస్తున్న ఓ హోటల్ వెయిటర్‌ను ఆదివారం మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే దేశంలోని కొందరు ప్రముఖుల వివరాలను ఇతను ఉగ్రసంస్థలకు చేరవేయడంతో పాటు, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ప్రభావంలోకి వెళ్లిపోయాడని... ఆ దేశానికి వెళ్లేందుకు సైతం ప్రయత్నిస్తున్నాడని కేంద్ర నిఘా వర్గాలు గుర్తించాయి. ఉత్తర్‌ప్రదేశ్ గజియాబాద్‌కు చెందిన నిందితుడు జయాద్‌ఖాన్ నుంచి రెండు డమ్మీ పిస్టళ్లు, మొబైల్ ఫోన్లు, కొంతమంది వీవీఐపీలకు చెందిన కీలక సమాచారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరిలో మేడ్చల్ పట్టణానికి వలస వచ్చిన జయాద్‌ఖాన్‌కు స్థానిక ముబారక్ హోటల్‌లో పనిచేసే ఫైజల్‌తో పరిచయం ఏర్పడింది. ఇతని సహకారంతో జయాద్‌ఖాన్ అదే హోటల్‌లో వెయిటర్‌గా చేరాడు. కాగా జయాద్ తరచూ దేశ వ్యతిరేక కార్యకలాపాలపై రీల్స్, తుపాకులు పట్టుకుని దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రాంలో పెట్టసాగాడు. ఇదే క్రమంలో ఇద్దరు యువకులు హబీబ్, రాణా ఇతని పోస్టులకు లైక్‌లు కొట్టి పరిచయం పెంచుకున్నారు. తరచూ వాట్సాప్ చాటింగ్‌లు చేసుకునే వారు. అనంతరం జయాద్ తనకు ఆయుధాలు సమకూర్చాలని హబీబ్, రాణాలను కోరడంతో వారు పాకిస్థాన్‌లోని ఐఎస్ఐకి చెందిన షహబాజ్‌ను ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయం చేశారు. ఈక్రమంలో జయాద్ ఇన్‌స్టాగ్రాం ద్వారా కొన్ని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు నెరపుతున్నాడు. ఉగ్రవాద శిక్షణలో పాల్గొంటానని పదే పదే చాటింగ్‌లలో కోరేవాడు. దీంతో పాక్‌లోని ఆ సంస్థల ప్రతినిధులు అతనికి కొన్ని పరీక్షలు పెట్టారు. భారత్ లోని కొందరు వీవీఐపీల వివరాలను అందజేయాలని సూచించారు. వెంటనే జయాద్ వాటిని సేకరించి వారికి పంపించాడు. ఈ క్రమంలో జయాద్ ఇన్‌స్టాగ్రాంలో పెడుతున్న పోస్టులు, ఉగ్రవాద లింకులు, పాక్ నుంచి అతనికి అందుతున్న ఆదేశాలను కేంద్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందాలు గుర్తించి మేడ్చల్ పోలీసులను అప్రమత్తం చేయడంతో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు పనిచేస్తున్న ముబారక్ హోటల్ యాజమాన్యం, సిబ్బంది కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇక్కడ పనిచేసే వారిలో చాలామంది ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉండటం గమనార్హం.

# అమెరికా–ఇరాన్ శాంతి మంత్రం!

(మొదటి పేజీ తరువాయి)



వార్తలపై ఇరాన్ అధికారికంగా స్పందించలేదు. ఆ దేశ వార్తా సంస్థ ఫార్స్ న్యూస్ మాత్రం ట్రంప్ ప్రకటన వాస్తవానికి చాలా దూరంగా ఉందని పేర్కొంది. ఒప్పందం కుదిరితే 30 రోజుల్లో హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలను యుద్ధానికి ముందునాటి పరిస్థితికి తీసుకొస్తామని ఇరాన్ మరో వార్తా సంస్థ టాస్నిమ్ న్యూస్ తెలిపింది. కాగా, భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించటంలో ప్రపంచంలో ఇరాన్‌ను మించిన దేశం మరొకటి లేదని ఆరోపించారు.

**ఒప్పందంలోని అంశాలు..**

కాల్పుల విరమణను 60 రోజులు పొడిగించే ఎంవోయూపై అమెరికా–ఇరాన్ సంతకాలు చేస్తాయి. రెండు దేశాలు అంగీకరిస్తే దీనిని మరింత కాలం పొడిగించవచ్చు. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుంది. అందులో అమర్చిన సముద్ర మందుపాతరలను తొలగిస్తుంది.

జలసంధి గుండా వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా తిరిగే వాతావరణం కల్పిస్తుంది. టోల్ వసూలు ఉండదు.

ఇరాన్ పోర్టులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేస్తుంది. ఇరాన్ తన చమురును స్వేచ్ఛగా విక్రయించుకొనేలా ఆంక్షలను తొలగిస్తుంది.

ఈ ఒప్పందాన్ని ఇరాన్ అమలు చేసే తీరును బట్టి ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలను, విదేశాల్లోని ఇరాన్ నిధులపై ఉన్న ఆంక్షలను అమెరికా తొలగిస్తుంది.

ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయబోనని హామీ ఇస్తుంది. యూరేనియం శుద్ధి కార్యక్రమాన్ని వదిలేస్తుంది. తనవద్ద ఇప్పటికే ఉన్న 60 శాతం శుద్ధి చేసిన 440.9 కిలోల యురేనియంను అమెరికాకు అప్పగించే అంశంపై చర్చలు కొనసాగుతాయి.

ఈ 60 రోజుల్లో రెండు దేశాల మధ్య అణు ఒప్పందంపై చర్చలు కొనసాగుతాయి.

పశ్చిమాసియాలో ఉన్న అమెరికా బలగాలు.. చర్చలు కొనసాగుతున్నంత కాలం ఎక్కడివక్కడే ఉంటాయి. తుది ఒప్పందం కుదిరిన తర్వాతే పూర్తిగా ఉపసంహరిస్తుంది.

లెబనాన్‌లో ఇజ్రాయెల్– హెజ్బొల్లా మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణను పూర్తిగా నిలిపివేయాలి.

భవిష్యత్తులో హెజ్బొల్లా దాడులకు దిగితే ప్రతిస్పందించే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంటుంది.

అణు ఒప్పందానికి ఇరాన్ అంగీకరిస్తే.. ఆ దేశం ఆర్థికంగా కోలుకొనేందుకు అమెరికా సహాయం అందిస్తుంది.

# ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు

- ప్రయాణికుల భద్రతకు హైటెక్ రక్షణ కవచం
- 'బస్సులో భరోసా' పేరిట నిరంతరం పర్యవేక్షణ
- ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 24:**

ఆర్టీసీ ప్రయాణికుల రక్షణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులకు రక్షణ కల్పిస్తూ.. ప్రశాంతమైన వాతావరణంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా బస్సుల్లో అత్యాధునిక సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ 'బస్సులో భరోసా' పేరిట సరికొత్త హైటెక్ భద్రతా ప్రాజెక్టును అమల్లోకి తెచ్చింది. తొలి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించారు. ఈ సరికొత్త భద్రతా వ్యవస్థ కింద ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఈ అత్యాధునిక నిఘా నేత్రాలను అమర్చారు. ఈ విజువల్స్ అటు డ్రైవర్, కండక్టర్లకు అందుబాటులో ఉండటమే కాకుండా ఆర్టీసీ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించేలా కనెక్ట్ చేశారు. దీనివల్ల బస్సుల్లో దొంగతనాలు చేసే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందే గుర్తించి అప్రమత్తం కావడానికి అవకాశం ఉంటుంది. మహిళా ప్రయాణికులపై వేధింపులు, దొంగతనాలు, అనుచిత ప్రవర్తన వంటి ఘటనలకు చెక్ పెట్టేలా ఆర్టీసీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాలకు ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధ ప్రయాణికులకు ఆర్టీసీ చర్య భరోసా కల్పించనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు సాధించే ఫలితాలను బట్టి రాష్ట్రంలోని అన్ని డిపోల బస్సుల్లో సీసీ కెమెరాలకు అమర్చేందుకు సంస్థ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాగా, ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికులకు భద్రతతోపాటు సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని, ప్రయాణికుల పట్ల సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- టియూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ
- హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాలి
- రాష్ట్ర కార్యదర్శి రామ్ నారాయణ
- కొత్తగూడెంలో ఘనంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా 3వ మహాసభ




**కొత్తగూడెం, (వార్త వేదిక సూర్య)-మే 24:**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం పోరాటాలు సాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. టియూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ పూర్వ అధ్యక్షులు ఇమ్మంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా జరిగింది. మృతి చెందిన జర్నలిస్టు మిత్రుల జ్ఞాపకార్థం తొలుత మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గలిగిన జర్నలిస్టు యూనియన్ సభ్యులుగా ఉండటం మనందరి అదృష్టమన్నారు. ఆ నాటి నుండి నేటి వరకు యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన యూనియన్గా ఉందని, దేశంలోనే నెంబర్ వన్ సంఘంగా ముందుకు దూసుకుపోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల కోసం నిరంతరం ప్రభుత్వానికి వినతులు అందిస్తూనే ఉన్నామని, ఉమ్మడి తెలుగు రాష్ట్రం వ్యాప్తంగా ఇప్పటికే 47 వేల అక్రిడేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధి అయిన జర్నలిజం వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృత్తి కొందరి కారణంగా దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికే కళంకాన్ని తెచ్చే కలుపు మొక్కల భరతం పట్టాలని చెప్పారు. సమాజాన్ని జాగృతం చేయాలనే తపన జర్నలిస్టుల మదిలో అనునిత్యం ఉండాలని, అలాంటి వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి టియూడబ్ల్యూజే (ఐజేయు) నిత్యం ముందడుగులో ఉంటుందని, వృత్తిలో ఎదురయ్యే ఆటుపోట్లకు జర్నలిస్టులు భయపడకుండా నిజాన్ని నిర్భయంగా బహిర్గతం చేయాలన్నారు. పరిరక్షణ కోసం నిరంతర పోరాటాలు చేయాలి – రాం నారాయణకత్తిమీద సాములాంటిది ఇ జర్నలిస్టు వృత్తని, అలాంటి జర్నలిస్టులు సమాజ మేలుతో పాటు తమ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేయాలని టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కే రామ్నారాయణ అన్నారు. అనగారిన వర్గాల గొంతుకగా జర్నలిస్టులు ఉన్నారని, అలాంటి జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల కోసం యూనియన్ తొలినాళ్ల నుండి రాజీలేని పోరాటం సాగిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోక పోవడంతో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్మంతర వద్ద మన గళం వినిపించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పాటైన తర్వాత ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డితో కలిసి యూనియన్ అధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు వివరించామని, వాటి పరిష్కారానికి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. జర్నలిస్టుల సమస్యల పరి ష్కారం కోసం నిరంతర కృషి సాగుతోందని, నూత నంగా ఏర్పాటైన జిల్లా కార్యవర్గం ప్రతీ మూడు నెలలకోసారి సమావేశాలు, సెమినార్లు నిర్వహిం చుకోవాలని సూచించారు. పరిధి దాటుతున్న జర్నలిజం తీరు–ఏనుగు వెంకటేశ్వరరావు ఒకప్పుడు ఎంతో గౌరవప్రథమైన జర్నలిజం వృత్తి ఇప్పుడు పరిధి దాటుతోందని, తద్వారా అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోందని టియూడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం జిల్లా అధ్య క్షులు ఏనుగు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మహాసభకు ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పరుదులు దాటి ప్రవర్తించడం సరైంది కాదన్నారు. వార్త సేకరణ విషయంలో నేడు అనేక సవాళ్లను జర్నలిస్టులు ఎదుర్కోవాల్సి వస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల జారీ విషయంలో పరిధి విధిస్తోందని, కాని ప్రభుత్వంలోని పెద్దలు ప్రజా ధనాన్ని ఎలాంటి పరిధి లేకుండా ఇష్టాను సారంగా ఖర్చు ఖర్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ఫోర్త్ ఎస్టేట్‌గా తమ పాత్రను సమర్థవంతంగా పోషించాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేనిజర్నలిస్టుల హక్కుల రక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్బులో ఘనంగా జరిగింది. ఈ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల విధులు, బాధ్యతలు అత్యంత కీలకమైనవని ఆయన కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఫోర్త్ ఎస్టేట్‌గా జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అమోఘమైనదని, క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. అయితే ప్రస్తుత తరుణంలో కొన్ని మీడియా యాజమాన్యాల తీరు మారాల్సిన అవసరం ఉందని, రాత్రింబవళ్లు శ్రమించే జర్నలిస్టులకు వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం, వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సుదీర్ఘకాల సమస్య అయిన ఇండ్ల స్థలాల అంశంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు దక్కే వరకు తాను వ్యక్తిగతంగా, పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి హెల్త్ కార్డు, ఇండ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమాజంలో నిష్పక్షపాత వైఖరితో వార్తలు రాసినప్పుడే జర్నలిజం విలువలు కాపాడబడతాయని, వృత్తిపరమైన బాధ్యతను విస్మరించవద్దని సూచించారు. జర్నలిస్టులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని, అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు








# భానుడి భగభగలు

(మొదటి పేజీ తరువాయి)

వడదెబ్బతో 17 మంది మరణించారు. వరంగల్ నగరంలోని ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతాలకు చెందిన ఆవునూరి రాజు (46), బేతి అశోక్ (55), చింతనూరి సరోజ(70), మైదం శ్రీను (55) వడదెబ్బతో మరణించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన వీరగాని వీరమ్మ (84), కొత్త రామయ్య (86), తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన అత్తిలి రాము (60), టీక్యాతండాకు చెందిన జాటోత్ బీమోజీ (85), నాంచారిమదూరుకు చెందిన సోమ నారాయణ (65), కేసముద్రం స్టేషన్ బడితండాకు చెందిన అజ్మీరాలచ్యా (72), గూడూరు మండల కేంద్రంలోని చిట్యాల గడ్డకు చెందిన పాపాని ఎల్లమ్మ (68), తొర్రూరు పట్టణానికి చెందిన పైండ్ల నర్సయ్య (43), జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన తేలు పెద్ది మల్లవ్వ (70), వర్ధన్నపేటకు చెందిన చందు ఐలయ్య(88) వడ దెబ్బతో చనిపోయారు. శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కుక్కల సారయ్య(74) వడదెబ్బతో ఆయిల్‌పామ్ తోటలో మృతి చెందగా.. యజమాని తీరుపై ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో మొలుగూరి నర్సింహరాములు (62) గేదెలను మేతకు తీసుకెళ్లి ఎండకు అస్వస్థతకు గురై మృతిచెందాడు. పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో నూక సాంబయ్య (65) శనివారం వ్యవసాయ పనులకు వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం ఉదయం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం వడదెబ్బతో 10 మంది చనిపోయారు. మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన కొరివి అచ్చయ్య(79), నేలకొండపల్లి మండలం మూటాపురం, నేలకొండపల్లికి చెందిన నంబూరి చిన నారాయణ(45), భీమాల వెంకటేశ్వర్లు (53), ఖమ్మం నగరంలోని పాతబస్టాండ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఎండదెబ్బతో మృతి చెందాడు. కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన సాయి చరణ్(35), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు చెందిన వంశీకృష్ణ(33), భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మాటూరి సావిత్రి (71), కండె వెంకన్న(42), చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామానికి చెందిన ఎన్.రజినీకాంత్ (36), ఖమ్మంలోని రామన్నపేటకు చెందిన గురజాల ఏడుకొండలు(50) వడదెబ్బతో ఆదివారం మృతి చెందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం వడదెబ్బతో ఐదుగురు మరణించారు. నిడమనూరు మండలం నారాయణగూడెంకు చెందిన పల్లా నర్సిరెడ్డి (74), యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన కామిటికారి వెంకటేష్ (47), సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఇస్తాళాపురంలో మడిపల్లి ఐలయ్య (66), కోదాడకు చెందిన ఏర్పుల శివ (40), నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో పంజాబ్‌కు చెందిన జైపాల్‌సింగ్ (36) వడదెబ్బకు మృతిచెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదివారం వడదెబ్బతో 8 మంది మృతి చెందారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన టేకుల రాజు (45), జమ్మికుంట పట్టణంలోని శివాలయం వద్ద భిక్షాటన చేసే 65 ఏళ్ల వృద్ధుడు వడదెబ్బతో ఆదివారం చనిపోయారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన యాదగిరి కనకయ్య(60), ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన గండ్ర సత్తమ్మ(65), యుటింక్లయిన్‌కాలనీకి చెందిన ముత్యం అశోక్(39), జగిత్యాల మండలం రాయికల్ పట్టణానికి చెందిన ఎద్దండి రాజవ్వ (85), గోదావరిఖనిలో సంపత్ (50) అనే మెకానిక్ వడదెబ్బకు మరణించారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రానికి చెందిన ఆదే లోడన్న (52) వడదెబ్బతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. లోడన్న సోదరుడు గణపతి శనివారం మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో జేవిలాల్ (46) అనే వ్యక్తి మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లిలో నరేశ్ (34) వడదెబ్బతో చనిపోయాడు.

**ఇంద్రవెల్లి:** ఎండలు రోజురోజుకూ తీవ్రతరమవుతుండడంతో ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన బిలాల్ ఫారుక్ (38) పని నిమిత్తం మహారాష్ట్ర కిన్వట్ తాలూకా పరిధిలోని గుట్టి గ్రామానికి వెళ్లాడు. అక్కడ వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు కూడా వడదెబ్బతోనే మృతి చెందినట్లు నిర్ధారించారు.



## ఆరోగ్య సేవల బలోపేతానికి టీపీసీసీ కమిటీలు

### డాక్టర్స్ సెల్ రాష్ట్ర కమిటీ, జిల్లా చైర్మన్లు, సలహాదారుల జాబితా విడుదల

### చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలి: మహేష్ కుమార్ గౌడ్

### ప్రజలకు చేరువయ్యేలా సేవా కార్యక్రమాలు: డా. రాజీవ్

హైదరాబాద్ : వార్తా వేదిక సూర్య

రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో టీపీసీసీ డాక్టర్స్ సెల్ ఠ మెడికల్ అండ్ హెల్త్ విభాగం రాష్ట్ర కమిటీ, జిల్లా చైర్మన్లు మరియు సలహాదారుల జాబితాను టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ అధికారికంగా విడుదల చేశారు. రాష్ట్ర చైర్మన్ డా. ఎం. రాజీవ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, వైద్య రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాజకీయాల్లో చదువుకున్న యువత భాగస్వామ్యం పెరగడం ద్వారా సమాజంలో నాణ్యమైన రాజకీయాలకు పునాది పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వైద్య రంగానికి చెందిన యువత, సేవా దృక్పథం కలిగిన నిపుణులు ప్రజా జీవితంలోకి రావడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు.

టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ విభాగ కమిటీల నియామకాలు కేవలం పార్టీ పరమైన వ్యవహారం కాదని, రాష్ట్ర ఆరోగ్య రంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తీసుకున్న కీలక నిర్ణయమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

"వైద్య సేవ అనేది అత్యంత గొప్ప సేవ. ప్రతి పేదవాడికి కూడా సమయానికి నాణ్యమైన వైద్యం అందేలా వ్యవస్థ పని చేయాలి. అది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తం తీసుకోవాల్సిన బాధ్యత" అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాల మెరుగుదల, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చే వైద్య నిపుణులకు కాంగ్రెస్ పార్టీ వేదికగా నిలుస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా డా. రాజీవ్ మాట్లాడుతూ కమిటీకి అధికారిక ఆమోదం లభించడంతో ఇకపై రాష్ట్రవ్యాప్తంగా విభాగం తరపున కార్యక్రమాలను మరింత చురుకుగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, అత్యవసర వైద్య సహాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

"ప్రపంచంలో అత్యంత విలువైనది ప్రాణం. ఒక సమాజ అభివృద్ధి ఆ సమాజంలోని ఆరోగ్య వ్యవస్థ బలం మీద ఆధారపడి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడిక్స్, టెక్నీషియన్లు, ఫార్మసీ, ల్యాబ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసే వాతావరణం అవసరమన్నారు.

వైద్య రంగంలో సేవాభావం, సమగ్ర దృష్టి, బాధ్యతాయుతమైన వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉందని, ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచే విధంగా టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ విభాగాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని డా. రాజీవ్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా వైద్య రంగానికి చెందిన నిపుణులు, యువ వైద్యులు, సేవా సంస్థలను ఒక వేదికపైకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దిశగా కమిటీలు పనిచేస్తాయని ఆయన వెల్లడించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై సోషల్ మీడియా దాడులు ఆపాలి

### - మేధావులను వేధించడం సమాజానికి ప్రమాదకరం: బొడ్డు శ్రీధర్

### - అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి

రాజేంద్రనగర్ , మే 24 మే ( వార్త వేదిక సూర్య ) :

ప్రఖ్యాత విద్యావేత్త, రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ పాత్రికేయుడు ప్రొఫెసర్ నాగేశ్వర రావును సోషల్ మీడియా వేదికగా వేధించడం అత్యంత దురదృష్టకరమని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్ తీవ్రంగా ఖండించారు.ప్రొఫెసర్ నాగేశ్వరరావు రాజకీయ పార్టీలకు అతీతంగా దేశ రాజకీయాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న అరుదైన మేధావి అని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలనే లక్ష్యంతో రాజ్యాంగం, చట్టాల పరిధిలో ప్రభుత్వాల పనితీరుపై విమర్శలు చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తి అని కొనియాడారు. సమా జంలో అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజలకు సేవలందించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జీవితాంతం కులాలకు అతీతంగా సమాజమే తన కుటుంబంగా భావిస్తూ జీవిస్తున్న వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. మేధావులను, ప్రజా సమస్యలపై మాట్లాడే వ్యక్తులను భయపెట్టే ప్రయత్నాలు ఆపాలని బొడ్డు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించి సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడుతున్న అల్లరి మూకలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీ ఎన్నిక

తుర్కపల్లి మే 24 వార్తా వేదిక సూర్య



తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షునిగా డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి నరసింహారెడ్డి, నక్క శ్రీశైలం, తునికి మహిరెడ్డి, పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా కొమ్మిరి శెట్టి నరసింహులు సంయుక్త కార్యదర్శిగా పలుగుల దశరథ, ప్రచార కార్యదర్శిగా సిద్ధి రామాచారి, కోశాధికారులుగా పోరెడ్డి మహిపాల్ రెడ్డి, ఆకుల బాలరాజు, సభ్యులుగా గొల్ల కేతమ్మ, కోడూరి ఆంజనేయులు, కసిరబోయిన గోపాల్ ,గడిపే ఇస్తారి, దిరావత్ బిచ్చు, ముఖ్య సలహా అధికారిగా పడాల చంద్రం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పిల్లలను కనిపించి ప్రయోజకులుగా ఎదగడానికి సర్వశక్తులు ధారపోసిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో ఆ పిల్లలు వారిని అవమాన పరుస్తూ, నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఇది అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు. వయోవృద్ధులు తమ పిల్లలనుండే కాకుండా సేవకులు ఇరుగుపొరుగు వారి నుండి వేధింపులకు గురవుతున్నారని అన్నారు. ఆస్తుల కోసం వేధింపులకు గురి చేస్తున్నారని పోషణ చేయకుండా గురి చేస్తున్నారని, వైద్య చికిత్సల ఖర్చు పెట్టకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ,ఇతర కారణాల వల్ల వేధింపులు గురి చేస్తున్నారని, ఇట్టి నివారణకు వేధింపులకు గురైన వయోవృద్ధులకు సంఘం అనేక విధాలుగా తోడ్పడుతుందని అన్నారు. కుటుంబ సభ్యులు వయోవృద్ధుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని, వారి అవసరాలను తీర్చాలని సమాజంలో వయోవృద్ధుల పట్ల గౌరవం అవగాహన పెంచాలని వేధింపులకు గురి అయిన వయోవృద్ధులకు సహాయం చేయడానికి వారిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, వయోవృద్ధుల వేధింపులకు వ్యతిరేకంగా చట్టాలను ప్రతిష్టంగా అమలు పరచాలని కోరారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నిబంధనలు, నేర నివారణ చట్టం 1983 ప్రకారం చర్యలు తీసుకోబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని దశరథ, మండలంలోని వివిధ గ్రామాల సీనియర్ సిటిజన్ సభ్యులు పాల్గొన్నారు

# ఉచితంగా యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి





యోగ గురూజీ ఊటుకూరి నాగేశ్వరావు

నల్గొండ మే 24 వార్తా వేదిక సూర్య

వేసవి కాలం సందర్భంగా విద్యార్థులకు, పెద్దవారికి సాఫ్ట్వేర్ ఇంజనీర్ , గృహిణులు వ్యాపారవేత్తలకు శ్రీ సత్య సాయి యోగ సేవ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఉచితంగా యోగ శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ యోగ గురూజీ ఊటుకూరి నాగేశ్వరావు కోరారు. ఆదివారం పట్టణంలోని రవీంద్ర నగర్ కాలనీ ఫణివిహార్ సెంటర్ లో ఉచిత యోగ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజ్య గురువులు బిక్షమయ్య గురూజీ సూర్యకుమారీ మాతాజీ వారి ఆశీస్సులతో యోగ సాధనలో ఉంటూ గత 17 సంవత్సరాలు గా 4 బ్యాచులు ఉచితంగా యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామ ని తెలిపారు .ఈ వేసవి సందర్భంగా విద్యార్థులకు, పెద్దవారికి ఉచితంగా యోగ శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్ , గృహిణులు, వ్యాపారవేత్తల తో పాటు విదేశీయులు సైతం ఆన్లైన్లో యోగ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ యోగాను బోనం మంగారెడ్డి నాగిరెడ్డి దంపతుల సహకారంతోలో గత రెండు సంవత్సరాల నుంచి ఉచితంగా మహిళలకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని ఈ శిక్షణలో భాగంగా సూర్య నమస్కారాలు, చంద్ర నమస్కారాలు శివ నమస్కారం హార్డ్ ఆసనాస్ ధ్యానం నేర్పించడం జరుగుతుందన్నారు.

ఇందులో ఐదు సంవత్సరాల నుండి 70 సంవత్సరాల పెద్దవాళ్లు హాజరవుతున్నారని వారిలో శారీరకంగా మానసికంగా ఆధ్యాత్మికంగా ఎక్కువగా మార్పు వచ్చిందని అదేవిధంగా వారిలో ఉన్న దీర్ఘకాలిక రుగ్మతులైన బిపి, థైరాయిడ్, షుగర్, బొల్లి స్కిన్ సంబంధించిన రుగ్మతలు బరువు తగ్గడం జరిగిందన్నారు. యోగాతో పాటుగా భజన లు స్లోకాలు మానవతా విలువలు కూడిన కథలు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తూ వారిని 50 మంది గురువులుగా తయారు చేశానని వారు కూడా కొన్ని సెంటర్లలో ఉచితంగా యోగ శిక్షణ తరగతులు నేర్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌనిక పసనూరి, దాసిరెడ్డి వినీత, విద్యార్థులు, చిన్నారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుంది

తుర్కపల్లి మే 24 వార్తా వేదిక సూర్య

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద బీసీ డబ్ల్యూ సి ఐ టి యు పలుగుల మైసమ్మ తల్లి సెంట్రింగ్ యూనియన్ మండల కమిటీ సమావేశం ఆనంద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశం హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నెత్రుత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టుతుందని అన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనలు తప్ప కార్మికుల ప్రయోజనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కొడ్స్ గా మర్చిందని అన్నారు. లేబర్ కొడ్స్ ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కొడ్స్ కార్మికుల పాలిట ఊరి తాళ్లుగా మారినాయని అన్నారు. కార్మికులపై పని భారం పెంచే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని అన్నారు. కార్మికులు హక్కుల కోసం పోరాడుతుంటే అణచివేస్తున్నారని అన్నారు. బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదమని ఉపన్యాసం చెపుతున్న రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబడ్ కొడ్స్ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో లేబర్ కొడ్స్ అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేరిపోతుల



ఎల్లేష్ ఆనంద్ తోటి మధు పరశురాం బొల్లారం జగదీష్ జంగంపల్లి బాలరాజ్ వెంకటేష్ మహేష్ జడల లింగం పల్లెపాటి భాస్కర్ అశోక్ గంధ మల్ల కృష్ణ శ్రీశైలం ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి మిత్రుడి అకాల మరణం



## అండగా నిలిచిన శివన్నగూడ 2000-2001 బ్యాచ్

మర్రిగూడ( వార్త వేదిక సూర్య ):

శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–2001 ఎస్ఎస్సీ బ్యాచ్, కుదాభక్షిపల్లి పూర్వ విద్యార్థి నాంపల్లి రాజు అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబానికి పాత స్నేహితులు అండగా నిలిచారు. రాజు హఠాన్మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన, సహచర మిత్రులంతా ఐక్యమత్యంతో ఒకతాటిపైకి వచ్చి, తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. ఎన్నో ఏళ్లు గడిచినా తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, కష్టసమయంలో ఉన్న మరణించిన మిత్రుడి కుటుంబానికి 61,501 ఆర్థిక సహాయాన్ని అందించారు. పూర్వ విద్యార్థులంతా రాజు కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నగదును అందజేశారు. స్నేహం అంటే కేవలం సంతోషాలను పంచుకోవడం మాత్రమే కాదని, కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలబడటమేనని నిరూపిస్తూ.. ఈ ఆపత్కాలంలో తమవంతు సహాయం ఆ కుటుంబానికి కొంత ఉపశమనాన్ని, ధైర్యాన్ని ఇస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రాజు కుటుంబానికి ఆర్థికంగా, మద్దతుగా నిలిచిన 2000–2001 పదవ తరగతి మిత్రులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## రాజేంద్రనగర్‌లో బీజేపీ సర్ సమావేశం

### ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు : మర్రి శశిధర్ రెడ్డి

రాజేంద్రనగర్ మే 24 ( వార్త వేదిక సూర్య ) :



భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ అసెంబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన బి ఎల్ ఎ -2 సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్ ) కార్యక్రమంపై నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ సార్ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అధ్యక్షతన పి.ఆర్ ప్యాలెస్‌లో జరిగిన సమావేశానికి మాజీ మంత్రి, సార్ జోనల్ ఇంచార్జ్ మర్రి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, మార్పులు చేర్పుల కోసం ప్రత్యేక ఫారాలు సమర్పించాలని వివరించారు. 2002--2004 మధ్య జరిగిన ఇంటెన్సివ్ రివిజన్‌ను కూడా ప్రస్తుత ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. పాత జాబితాల్లో పేర్లు లేని వారు తమ పౌరసత్వం, వయస్సుకు సంబంధించిన ఆధార పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల అనంతరం వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించి తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, వై శ్రీధర్, తోకల శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, విజయ్ కుమార్, వనిత రెడ్డి, సదానంద్, కడెం సుధాకర్, జయనంద్ రెడ్డి, బాబురావు, నిఖిల్, విక్రమ్ చారి, రవి, వెంకటేష్, సందీప్ ముదిరాజ్, ఆనంద్, వెంకట్ రెడ్డి, సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ గౌడ్, పద్మావతి, సరిత రెడ్డి, అనురాధ, కవిత, సప్నారెడ్డి, అమర్, శ్రీనివాస్, విజయ్, శివ, షేక్ బాషా తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలి

### భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి

### 28 వ తేదీలోపు మిగిలిన అన్ని సెంటర్లలో వద్ద కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి

### ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, మే 24 (వార్తా వేదిక సూర్య )

నకిరేకల్ ఎం.ఆర్.ఓ కార్యాలయం లో కేతపల్లి, నకిరేకల్, కట్టంగూర్ మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశం పై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు మండలాల్లో, మొత్తం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికి 23 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 28 వ తేదీలోపు మిగిలిన అన్ని సెంటర్లలో వద్ద కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత , మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల – మాధవ్ రెడ్డి , అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్‌లో జోరుగా బీఆర్ఎస్ చేరికలు

## కార్తీక్ రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి యువత

- కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలు
- యువతే రాజకీయ మార్పుకు ప్రధాన శక్తి: కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్ మే 24 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగు తోంది. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై కాటేదాన్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, యువత భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో సాయిబాబానగర్ స్టేషన్ బద్వేల్ ప్రాంతానికి చెందిన పలువురు యువ నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి, కార్తీక్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. యువతే రాజకీయ మార్పుకు ప్రధాన శక్తి అని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం యువత ఇంత పెద్ద సంఖ్యలో ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. యువతే రాజకీయ మార్పుకు ప్రధాన శక్తి అని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం యువత ఇంత పెద్ద సంఖ్యలో ముందుకు రావడం శు భపరిణామం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. గులాబీ గూటికి చేరిన వారిలో శ్రీకాంత్, శ్రీను, మోహన్, రాజు, బాల్‌రాజ్, ప్రసాద్, నవీన్ కుమార్, హరీష్, శ్రీకాంత్ యాదవ్, రాకేష్ యాదవ్, నాని ముదిరాజ్, లక్ష్మి, మాధురి, ప్రియాంక, రత్నమ్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు గుమ్మడి కుమార్, రాము యాదవ్, రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్, భాస్కర్, వెంకటరమణ, అశోక్ కుమార్, రిషి, సంతోష్, ప్రవీణ్, రామకృష్ణ, ఆనంద్, అనిల్, చిన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

రాజేంద్రనగర్, మే 24 ( వార్త వేదిక సూర్య ) :





శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-44 రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ మధుబన్ కాలనీకి చెందిన గూడ రాజు తన భార్య గూడ స్వప్నతో కలిసి షాద్‌నగర్‌లో ఉన్న తమ కుమార్తె ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలమాకుల గ్రామ పరిధిలోని మారుతి మోడ్రన్ రైస్ మిల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్జే32జీఈ4605 నంబర్ గల లారీ కంటైనర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గూడ స్వప్న రోడ్డుపై పడిపోగా, లారీ టైర్ ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గూడ రాజుకు చేతులు, కాళ్లు, ముఖంపై గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ అజీత్ కుమార్‌ను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ 'ఎంపిక ధోరణి'పై ప్రజా ఆగ్రహం





## చెరువులు, ఆలయ భూముల ఆక్రమణలపై వివక్ష ఎందుకు?

-- 25 చెరువులు గురవుతుంటే కేవలం 3--4 పైనే ఫిర్యాదులా?

-- శంషాబాద్ రూ. 1,000 కోట్ల భూ కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదు?

-- మైలార్దేవ్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ సూరెడ్డి వినయ్ రెడ్డి తీవ్ర ధ్వజం

రాజేంద్రనగర్ , మే 24 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, ఆలయ భూముల ఆక్రమణల విషయంలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అవలంబిస్తున్న 'ఎంపిక ధోరణి' పై స్థానిక ప్రజలు మరియు రాజకీయ శ్రేణులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. నిన్న ఎమ్మెల్యే హైడ్రా ( కమిషనర్ రంగనాథ్ ని కలిసి కేవలం 3 నుండి 4 చెరువుల ఆక్రమణలపైనే ఫిర్యాదు చేయడం వెనుక ఉన్న మర్మమేమిటని మైలార్దేవ్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ సూరెడ్డి వినయ్ రెడ్డి నిలదీశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 25 చెరువులు ఆక్రమణలు, విధ్వంసానికి గురవుతున్న వాస్తవాన్ని ఎమ్మెల్యే పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు.

నియోజకవర్గంలో పలు కీలక ప్రాంతాలు భూ ఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకున్నాయని వినయ్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె చెరువు సమీపంలో కొంతమంది ప్రభావశీలురు, ఎమ్మెల్యే అనుచరులు పెద్ద ఎత్తున భూములను ఆక్రమించినా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదు. ఫెరాగి నాలా తీవ్ర ఆక్రమణలకు గురైంది. అలాగే శంషాబాద్ సర్వే నంబర్ 725లో సుమారు 100 ఎకరాల భూమిని కొంతమంది బిల్డర్లు గురకాయ స్వాహా చేసినా ఇప్పటివరకు ఒక్క గంభీరమైన ఫిర్యాదు కూడా నమోదు కాలేదు. సాతంరాయిలోని పవిత్ర సీతారామ ఆలయ భూములు కొంతమంది వ్యాపారవేత్తల పాలవుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటి? గగన్‌పహాడ్ ప్రాంతంలోని మామిడికుంట చెరువు స్థానిక కంపెనీ యజమానుల ఆక్రమణలకు గురవుతున్నా సరైన చర్యలు లేవు. ఎమ్మెల్యే గారు శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు రాగద్వేషాలకు అతీతంగా పనిచేస్తానని ప్రమాణం చేశారు. మరి ఈ రోజు కొన్ని ఆక్రమణలపై మాత్రమే ఫిర్యాదులు చేస్తూ, మిగిలిన తీవ్రమైన ఆక్రమణలను పట్టించుకోకపోవడం ఆ ప్రమాణాన్ని ఉల్లంఘించడమే అవుతుంది అని

సూరెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. హైడ్రా పరిధిలో వివక్ష ఎందుకు? శంషాబాద్‌లోని సర్వే నంబర్ 626/1 లో కొన్ని ఆక్రమణలను కూల్చివేసిన హైడ్రా అధికారులు, అదే చిత్రంలో కనిపిస్తున్న ఒక నిర్దిష్ట ఇంటిని ఎందుకు కూల్చకుండా వదిలేశారని వినయ్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ అధికారులు సర్వే చేసినా చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతమని ఆయన అడిగారు. అలాగే, ఇటీవల వెలుగులోకి వచ్చిన రూ. 1,000 కోట్ల భూ కుంభకోణంపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు ఇంతవరకు నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ కుంభకోణం ఎవరి కనుసన్నల్లో జరిగింది? ఎవరెవరి ప్రమేయం ఉంది? ఎవరికి ఎంత వాటా ముట్టింది? అనే విషయాలను ప్రజల పక్షాన తేల్చాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేను ప్రశ్నించిన వారిపై మానసిక, ఆర్థిక ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా నియోజ కవర్గంలోని అన్ని చెరువులపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, ఆక్రమణల అధికారిక జాబితాను విడుదల చేయాలి. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా, రాజకీయ సంబంధాలు చూడకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చెరువుల పునరుద్ధరణ మరియు శుభ్రత కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలి. ఆలయ భూములు, చెరువుల రికార్డులను పారదర్శకంగా డిజిటల్ రూపంలో భద్రపరచాలి. ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

రాజేంద్రనగర్ ప్రజానీకం, పారదర్శకత మరియు న్యాయం కోసం క్రింది డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆయన కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ సంపదను, ప్రకృతిని కాపాడేందుకు రాజకీయ పక్షపాతం లేకుండా అందరిపై సమానంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విమర్శలు




- 20 ఏళ్లుగా లేని అవగాహన ఇప్పుడొచ్చిందా?
- రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే మా షెడ్ల కూల్చివేత.
- ధైర్యముంటే ఆ అక్రమ లేఅవుట్లు, గోదాములపై హైడ్రాకు ఫిర్యాదు చెయ్: ఎమ్మెల్యేకు సవాల్.

రాజేంద్రనగర్ మే 24 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణల అంశంపై స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇవ్వడంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు తోకల శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ బుద్ధ భవన్‌లో ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడం పెద్ద విడ్డూరమని, ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టే డ్రామా అని ఆయన విమర్శించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రకాష్ గౌడ్‌కు, ఇప్పుడు అకస్మాత్తుగా చెరువులు, కుంటలు గుర్తుకు రావడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున కబ్జాలు జరగడానికి ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. శంషాబాద్ ప్రాంతంలో జరుగుతున్న భూ కుంభకోణాలను తాను ఆధారాలతో సహా బయటపెడుతున్నందుకే, తనను భయపెట్టేందుకు ఇలాంటి పిల్లిమొగ్గలు వేస్తున్నారని మండిపడ్డారు. 1987లో తమ తాత కొనుగోలు చేసిన చట్టబద్ధమైన వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన పరిశ్రమల షెడ్లను, పోలీసుల సహకారంతో కూల్చివేయడం శుద్ధ రాజకీయం అని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పేరుతో కావాలనే కక్షసాధింపుకు పాల్పడ్డారని, ఈ వ్యవహారం ప్రస్తుతం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, కేవలం సెలెక్టివ్‌గా కాకుండా నియోజకవర్గంలోని క్రింది ప్రధాన అక్రమాలపై కూడా హైడ్రాకు ఫిర్యాదు చేయాలని శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. టీఎన్‌జీఓస్ కాలనీ పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన అపార్ట్‌మెంట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి. మైలార్‌దేవ్‌పల్లి (సర్వే నెం. 156/1) ప్రభుత్వ భూములను అక్రమంగా లేఅవుట్లుగా మార్చి విక్రయించిన వ్యవహారంపై ఫిర్యాదు చేయాలి.

గన్సీమియాగూడ (శంషాబాద్) పేద రైతుల భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుని నిర్మించిన అక్రమ గోదాములను కూల్చివేయాలన్నారు.

భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకమని.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరిగిన ప్రతి భూ కుంభకోణాన్ని ప్రజల ముందు ఉంచుతామని ఆయన హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్, వై. శ్రీధర్, కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, విజయ్ కుమార్, సందీప్ నిఖిల్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నార్సింగి పోలీసుల అదుపులో స్పీడ్ వీరుడు

- ఔటర్ రింగ్ రోడ్‌పై 200 కిలోమీటర్ల వేగంతో రచ్చ.. సోషల్ మీడియాలో వీడియో వైరల్

రాజేంద్రనగర్ మే 24 ( వార్త వేదిక సూర్య ) :

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై అత్యంత ప్రమాద కరంగా వాహనం నడిపి, ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రజల్లో భయాందోళనలు కలిగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నార్సింగి పోలీసుల వివరాల ప్రకారం, రోడ్డు గస్తీ అధికారి కారింగుల సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 10వ తేదీ ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక వ్యక్తి వోక్స్‌వ్యాగన్ విర్టస్ కారును టీజీటీఆర్ 2026 తాత్కాలిక నంబర్‌తో నార్సింగి టోల్‌గేట్ నుంచి టీజీపీఏ టోల్‌గేట్ వైపు ఔటర్ రింగ్ రోడ్‌పై గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో నిర్లక్ష్యంగా నడిపాడు. ఈ ఘటనను మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి యశ్వంత్ రెడ్డి పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 396/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 125, 281 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో నిందితుడిగా కొత్తపల్లి యశ్వంత్ రెడ్డి (32), ఆల్కాపూర్ టౌన్‌షిప్, పుప్పాలగూడ నివాసి అని గుర్తించారు. పోలీసుల విచారణలో యశ్వంత్ రెడ్డి ఏప్రిల్ 2026లో వోక్స్‌వ్యాగన్ విర్టస్ వాహనం కొనుగోలు చేసినట్లు, వాహనం పనితీరును పరీక్షించేందుకు ఔటర్ రింగ్ రోడ్‌పై ప్రవేశ ద్వారం నెంబర్ 18(ఏ) నుంచి వాహనాన్ని సుమారు 200 కిలోమీటర్ల వేగంతో నడిపినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నేరానికి ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు నార్సింగి పోలీసులు హెచ్చరిక జారీ చేస్తూ.. నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకర విన్యాసాలు చేసి వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారి ఘోర రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశముందని స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నట్లు నార్సింగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. హరి కృష్ణ రెడ్డి తెలిపారు.

# పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

నల్లగొండ బ్యూరో, మే 24 (వార్తా వేదిక సూర్య )



చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి, సుంకేనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లారీల రవాణా, హమాలీల అందుబాటు, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతన్నలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. అనంతరం రామన్నపేట మండలంలోని వెల్లంకి, సిరిపురం, రామన్నపేట పట్టణం, దుబ్బాక, మునిపంపుల, ఎన్నారం గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంట వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం నార్కెట్‌పల్లి మండలం బాజకుంట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్కెట్‌పల్లి మండలంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ధాన్యం కొనుగోలు అంశం పై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించి, రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

సంపుటి : 2 సంచిక: 5 వార్త వేదిక సూర్య హైదరాబాద్ సోమవారం, మే 25, 2026



## వేసవి జాగ్రత్తలపై అవగాహన

**జూలూరుపాడు,మే 24(వార్తా వేదిక సూర్య ) :**
జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతిక సారథి ఆధ్వర్యంలో, డిపిఆర్ఓ పర్యవేక్షణలో కళాకారులు గ్రామాల్లో డప్పుల ప్రదర్శనలు, ఆటపాటల ద్వారా ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భానుడి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు సందేశం ఇచ్చారు. మధ్యాహ్న వేళల్లో అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులు ఎండ ప్రభావానికి గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.
డప్పుల మోత, జానపద గీతాలు, నృత్యాలతో కళాకారులు ప్రజలను ఆకట్టుకుంటూ ఎండదెబ్బ నివారణపై చైతన్యం కల్పించారు. గ్రామ ప్రజలు కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించి కళాకారుల సందేశాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ ముసా,బాలు, హుస్సేన్,స్నేహ, నరేందర్,నీల, తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**ములకలపల్లి,మే24 (వార్తా వేదిక సూర్య) :**



మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మండల వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ అభిమానులు, 'జై భీమ్' యూత్ కమిటీ సభ్యులు కోరుతున్నారు. ప్రస్తుతం ములకలపల్లి ప్రధాన సెంటర్లో సెంటర్ లైటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తి కాగా, మరికొన్ని నెలల్లో ఈ లైటింగ్ పనులన్నీ పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో అందరికీ అనుకూలంగా ఉండే "సాయిబాబా గుడి సర్కిల్లో" బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల కేంద్రం నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అందరి బాధ్యత పలువురు అభిప్రాయపడుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించి, ఇక్కడ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇచ్చి, అవకాశం కల్పించాలని కోరుతున్నారు. చేస్తున్న లైటింగ్ పనులు పూర్తయ్యే లోపే విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాలని, దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సానుకూలంగా స్పందించాలని అంబేద్కర్ అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ను అభినందించిన ఎమ్మెల్యే

**సత్తుపల్లి, మే 24(వార్తా వేదిక సూర్య )**





తెలంగాణ పాలిసెట్ ఎంట్రన్స్ లో 120 కి 120 మార్క్స్ తెచ్చుకోవడం ద్వారా స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విశ్వశాంతి విద్యాలయం విద్యార్థి ఎండి. అర్పస్ అలీని ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎండి. రెహానా బేగం కమల్ పాషా లు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాలలో సత్తుపల్లి విద్యార్థి కి కి స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం నాకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, సత్తుపల్లి పిఏ సొసైటీ సహకార సంఘ అధ్యక్షులు చెల్లగల కృష్ణయ్య,టౌన్ పార్టీ అధ్యక్షులు చెన్నారావు, పలువురు కౌన్సిలర్లు,పాఠశాల డైరెక్టర్ నరుకుళ్ల సత్యనారాయణ ,ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరావు, విద్యార్థి తండ్రి అఫ్జల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# పోటెత్తిన భద్రగిరి...!





**- భద్రాద్రి కి భారీగా భక్తులు**
**- సెలవు దినం కావడంతో**
**- మండుటెండను లెక్కచేయక**
**- పురవీధుల్లో భక్తుల కోలాహలం**

**భద్రాచలం కల్చరల్, మే 24,(వార్తా వేదిక సూర్య) :**
భద్రాచలంలో ఆదివారం రామయ్య దర్శనం కోసం భక్తులు విశేషంగా వచ్చారు.వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు ఉన్నా ఎండ వేడిని లెక్కచేయకుండా దర్శనం కోసం క్యూ లైన్ లలో వేచి ఉన్నారు. రామయ్య దర్శనానికి కనీసం 3,4 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. భక్తులను కంట్రోల్ చేయడానికి రామాలయ సిబ్బంది సంయమనంతో వ్యవహరించారు. అందరికీ దర్శనం కల్పించేలా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి
కే దామోదర్ రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.
భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. వేసవి తాపాన్ని ఎదుర్కొనేందుకు క్యూలైన్ల వద్ద భారీ ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. మిథిలా ప్రాంగణం చుట్టూ యాత్రికుల బస్సులు, కార్లతో రామాలయం పరిసర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి.

**కమనీయంగా రామయ్య నిత్యకల్యాణం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో అధిక జ్యేష్ఠ మాసం, ఆదివారం మఖా నక్షత్రం సందర్భంగా నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు తదితర నిత్య కైంకర్యాలు జరిపారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిలో బేడా మండపానికి తీసుకొని వచ్చి స్వామివారికి కంకణ ధారణ యజ్ఞోపవీత ధారణ, సీతమ్మకు యోక్త్ర ధారణ నిర్వహించారు. అనంతరం స్వామివారి, అమ్మవారి వంశ ప్రవరను భక్తులకు, భక్తుల గోత్రనామాలను స్వామివారికి విన్నవించారు. అనంతరం జీలకర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలవేడుక, మంగళ శాసనములతో నిత్య కళ్యాణం నిర్వహించారు. కళ్యాణం పూర్తయిన తర్వాత కళ్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు సమర్పించారు. వేసవి సెలవులు, ఆదివారం సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఈ పాల్గొన్నారు



# సత్తుపల్లిలో ఆధ్యాత్మిక శోభ

**శ్రీ భాగవత సప్తాహ ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల**

**సత్తుపల్లి, మే 24 (వార్తా వేదిక సూర్య) :**
సత్తుపల్లి కేంద్రంలో గల విద్యానగర్ రోడ్‌లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు సమీప బంధువుల గృహంలో గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ భాగవత సప్తాహ పూజా కార్యక్రమాలు ఈరోజుతో మంగళప్రదంగా ముగిశాయి. ఈ ముగింపు మహోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీమాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యుల వారి దివ్య పర్యవేక్షణలో గత ఏడు రోజులుగా ఈ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకలో స్థానిక గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు



# సామాన్యుడిపై ధరల భారం

**-సిపిఐ నేత మహమ్మద్ యూసుఫ్**

**ములకలపల్లి, మే24 (వార్తా వేదిక సూర్య) :**
కేంద్ర ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి పెట్రోల్ పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసలు పెంచడంపై సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్పి గెలవగానే ధరలు పెంచుతూ సామాన్య ప్రజలను బీజేపీ సర్కార్ మోసం చేస్తోందని విమర్శించారు.
అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే ఇక్కడ రేట్లు పెంచే కేంద్రం, అంతర్జాతీయంగా తగ్గినప్పుడు ఇక్కడ ఎందుకు తగ్గించలేదని ఆయన ప్రశ్నించారు.
కమర్షియల్ గ్యాస్ ధరను సుమారు రూ.1000 పెంచడం వల్ల హోటళ్లు, కర్రీ పాయింట్లు నడపలేక మూతపడుతున్నాయని, దీంతో ఎంతోమంది అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ధరల పెంపు ప్రభావం రవాణా రంగంపై పడి కూరగాయలు, నిత్యవసర సరుకులు, వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడి నడ్డి విరుస్తుని అన్నారు. శ్రమనే నమ్ముకుని బతికే కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్,



గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ డిమాండ్ చేసింది



## పాండురంగాపురంలో అగ్ని ప్రమాదం

**పినపాక,మే24 (వార్తా వేదిక సూర్య) :**
పినపాక మండలం పాండురంగాపురం గ్రామంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.
పొలాల్లో నిప్పులు పెట్టడం, అలాగే వీస్తున్న ఈదురుగాలుల కారణంగా మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన వెల్లడించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలాల్లో నిప్పులు వేయవద్దని తహసీల్దార్ సూచించారు. ఎస్సై సురేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సర్పంచ్ ఈసం భవతి, అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు

## నందనవనంలో ఫీల్ గుడ్ రిక్రియేషన్ ప్రోగ్రాం

**పాల్వంచ,మే 24 (వార్తా వేదిక సూర్య) :**



పాల్వంచ మండలం సోములగూడెం గ్రామంలోని నందన వనం పార్క్ నందు ఫీల్ గుడ్ రిక్రియేషన్ ప్రోగ్రం నిర్వహించారు.ఈ ఫీల్ గుడ్ రిక్రియేషన్ ప్రోగ్రాంలో పాల్వంచ పట్టణంలోని ప్రముఖులు, వాకర్స్ సుమారు మూడు వందల మంది పాల్గొన్నారు.పార్క్ లోని వాకింగ్ ట్రాక్ మీద ఉదయం వాకింగ్ చేస్తూ ప్రక్రుతి అందాలను ఆస్వాదిస్తూ, స్వచ్ఛమైన గాలిని,ఆక్సిజన్ రూపంలో పీలుస్తూ ఫీల్ గుడ్ గా పరవశించిపోయారు.ఈ కార్యక్రమంలో యఫ్.డీ.ఓ దామోదర్ రెడ్డి, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వం, సింధు తపశ్వి,కొచ్చర్ల రామకృష్ణ,యోగ గురువు గంధం పట్టాభి రామారావు , ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సిబ్బంది, జర్నలిస్ట్ లు ముత్తినేని శ్రీను, చంద్ర నర్సింహరావు, శనగ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు

## బూత్ కమిటీల కసరత్తు

**పాల్వంచ,మే24 (వార్తా వేదిక సూర్య) :**



మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది.
బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, డిజిటల్ శిక్షణ కార్యక్రమం సమావేశం నేపథ్యంలో కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ డివిజన్ల మరియు మండలాలకు చెందిన సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వేగవంతం, డిజిటల్ యాప్ వినియోగం మరియు పార్టీ బలోపేతంపై నాయకత్వం దిశానిర్దేశం చేసినారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమిష్టిగా పని చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనమా మరియు కార్యకర్తలు ఉత్సాహం సమావేశంలో పాల్గొన్నారు

## సాగునీటి కల సాకారం దిశగా అడుగులు

**యాతాల కుంట టన్నెల్ పనులను పరిశీలించనున్న మంత్రి తుమ్మల**

**సత్తుపల్లి, అశ్వరావుపేట వాసుల తీరనున్న సాగునీటి కల**

**సత్తుపల్లి, మే 24 (వార్తా వేదిక సూర్య):**
సత్తుపల్లి మండల పరిధిలోని యాతాల కుంట వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ టన్నెల్ (సొరంగ మార్గం) పనులను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు, సోమవారం ఉదయం 9:45 గంటలకు స్థానిక శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ తో కలిసి ఆయన ఈ పర్యటనలో పాల్గొననున్నారు.
సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రధాన అడ్డంకిగా మారిన యాతాల కుంట టన్నెల్ పనులు శనివారంతో దాదాపుగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, ప్రాజెక్టును వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల ఈ పర్యటన చేపట్టారు, పనుల ప్రగతిని స్వయంగా పర్యవేక్షించడంతో పాటు, తదుపరి చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయన కీలక సూచనలు చేయనున్నారు

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం క్రైం మే 24(వార్త వేధిక సూర్య) :** మే, 25 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు

## గిరిజన దర్బార్‌కు హాజరుకండి

**భద్రాచలం ఐటీడీఏ సెంటర్, మే24 (వార్త వేధిక సూర్య) :**



సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు

## సారపాకలో వరుస మృతులు

### -స్థానికుల్లో ఆందోళన

**సారపాక, మే 24 (వార్త వేధిక సూర్య) :**



సారపాక ప్రధాన సెంటర్‌లో వరుసగా గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందుతున్న ఘటనలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. గత రెండు రోజులుగా రక్తపు వాంతులతో వ్యక్తులు మృతి చెందడం ఎండల తీవ్రత ఎంత ప్రమాదకర స్థాయికి చేరిందో తెలియజేస్తోంది. వడదెబ్బ కారణమా లేక ఇతర అనారోగ్య సమస్యలా అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టత రానుంది.

మండుతున్న ఎండల్లో పేదలు, వలస కూలీలు, నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. చాలామంది మంచినీళ్లు కొనుగోలు చేసి తాగే పరిస్థితిలో లేకపోవడంతో పంచాయతీలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. సమయానికి తాగునీరు, వైద్యసహాయం అందితే ఇలాంటి ఘటనలు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు

# భద్రాచలంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం





**భద్రాచలం అర్బన్,మే 24(వార్త వేధిక సూర్య) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో ఆదివారం ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్, హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చేకూరి వెంకట్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణతో వారు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు.

హెచ్‌సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడమే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువత ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.

ఈ ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపులో కోచ్‌లుగా కుప్పాల చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్ శిక్షణ అందిస్తారని తెలిపారు.

కార్యక్రమ ప్రారంభానికి గుర్తుగా ఐటీడీఏ పీవో రాహుల్ బ్యాటింగ్ చేయగా, హెచ్‌సీఏ కార్యదర్శి చెరుకూరి వెంకట్ బౌలింగ్ చేసి క్యాంపును అధికారికంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



**సారపాక, మే 24 (వార్త వేధిక సూర్య) :** బూర్గంపాడు మండలంలోని తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ ఇన్‌చార్జ్ పోడియం నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల బూర్గంపాడు మండల గౌరవ అధ్యక్షుడు తోడేటి సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు.

ఈ సందర్భంగా సారపాకలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో అమలులోకి రానున్న తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు విధివిధానాలపై సమావేశంలో వివరించారు. ఇప్పటివరకు ఉద్యమంలో పాల్గొన్న పలువురికి ఉన్న అనుమానాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీరెల్లి దుర్గారావు, కాసర్ల దామోదర్ రెడ్డి, కొక్కొండ ప్రసాద్, బాసిపోయిన మోహన్‌రావు, పారుపల్లి శ్రీనివాస్, దాసరి సాంబ, శెనగ పుల్లారావు, నల్లమోతు సురేష్, గుర్రాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ విగ్రహం రక్షణ గోడను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



## : జేఏసీ నాయకులు డిమాండ్

**భద్రాచలం టౌన్, మే 24(వార్త వేధిక సూర్య) :** భద్రాచలం పట్టణంలో నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రక్షణ కరువైందని, ఒక గుర్తు తెలియని వాహనం అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న రక్షణ గోడను ఢీకొని ధ్వంసం చేసిందని,దీనిపై భద్రాచలం ఎస్టీ ఎస్సీ బీసీ మైనారిటీ జేఏసీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మండుటెండలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. జై భీమ్ అంటూ నినాదాలు చేస్తూ...కనీసం స్పృహ లేకుండా ఇష్టం వచ్చినట్టుగా డ్రైవింగ్ చేస్తూ రక్షణ గోడను ధ్వంసం చేసిన డ్రైవరు, వాహనం మీద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి అని కోరారు. ఇది కావాలనే ఎవరైనా చేశారా...? అనేది కూడా విచారణ చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికీ ఇరవై నాలుగు గంటలవుతున్న కూడా వాహనాన్ని సీసీ కెమెరా ద్వారా గుర్తించి ఏ అధికారి కూడా చర్యలు తీసుకోలేదని జేఏసీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముర్ల రమేష్ ,ఈటె రాజేశ్వరరావు,పల్లంటి రాజేశ్వరరావు, భీమపాక పెద్దరాజు,టి.వి, ఇమ్మంది నాగేశ్వరావు,పేరాల నాగరాజు,ముద్ద పిచ్చయ్య, దాసరి శేఖర్, నాగార్జున , 10వ వార్డు మెంబర్ నిట్టా రాజు,కేసుపాక వెంకటేశ్వర్లు,సోందే రవికుమార్,కేసుపాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## చంద్రుగొండలో కాసేపు తాటి

**చంద్రుగొండ,మే 24 (వార్త వేధిక సూర్య) :** చంద్రుగొండ మండల కేంద్రంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి జ్యూస్ దుకాణం వద్ద ఆగి గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ఆదివారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి కూర్చుని జ్యూస్ తాగుతూ వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు.

ముఖ్యంగా గ్రామంలో ఎదురవుతున్న సమస్యలు, రైతాంగానికి సంబంధించిన ఇబ్బందులపై లోతైన చర్చ జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం అనే దృఢ సంకల్పంతో, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు నిరంతరం ప్రజల్లో ఉండి వారి కోసం పోరాడాలని తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరుకుళ్ళ సత్యనారాయణ గారు, మాజీ సర్పంచ్ గూగులోత్ రమేష్ గారు చిన్నం రామకృష్ణ గారు, గాదె లింగయ్య గారు, సత్య నాగేశ్వరరావు గారు, సంకా కృపాకర్ గారు,వంకాయలపాటి బాబురావు గారు, పవన్ కుమార్ గారు, అనుమాల హనుమంతరావు గారు, రామిశెట్టి సైదయ్య గారు తదితరులు పాల్గొన్నారు

## లక్ష్మీకాంతమ్మకు ప్రతిభ నోబెల్ అవార్డు

**హైదరాబాద్ - వార్త వేధిక సూర్య :**



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సహకారంతో వల్లూరి ఫౌండేషన్ డాక్టర్ వి.ఆర్ శ్రీనివాసరాజు అధ్యక్షతన రవీంద్ర భారతిలో డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు ప్రతిభ నోబెల్ అవార్డు ఆదివారం అందించారు. లక్ష్మీకాంతమ్మ చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డు లభించింది. ఎన్నో గ్రామాలలో ఆమె అందిస్తున్న సేవ చాలా గొప్పదని, వెనుకబడిన మహిళలకు,యువతీ, యువకులకు పురుషులకు, వృద్ధులకు ఆమె సేవలందించారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలను ముందుకు తీసుకుపోవడానికి వారి చేత నెలకు రూ. 200 రూపాయలు పొదుపు కట్టించి 250 మంది మహిళలచే పొదుపు కార్యక్రమం ఏర్పాటు చేసి వారి కుటుంబాలలో వెలుగులు నింపారు. యువతి, యువకులకు చేయూత నిస్తూ వృద్ధులకి ఆసరాగా దుస్తుల పంపిణి చేస్తూ ముందుకి సాగుతున్నారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగన్ హైదరాబాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దైవాజ్ఞ శర్మ,తమిళ్,తెలుగు సినిమా యాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వీరి ఆధ్వర్యంలో తాను ప్రతిభా నోబెల్ అవార్డును అందుకోవడం చాలా సంతోషమని అవార్డు గ్రహీత ఈ సందర్భంగా తెలిపారు. తాను అందుకొనే ఈ అవార్డ్స్ చాలా ఆనందం, భాద్యతని తెలియ చేస్తుందని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు

## ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్ సుడిగాలి పర్యటన

**ఖమ్మం మే 24 (వార్త వేధిక సూర్య) :**



ఏన్కూర్ మండలంలోని పలు బీటీ రోడ్ల సర్వే పనులను ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తాండ్ర మధుకర్ పరిశీలించారు. పనులు పూర్తి పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. గార్ల ఒడ్డు తండా, నాచారం తదితర గిరిజన గ్రామాలను సందర్శించిన సందర్భంగా స్థానికులు రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ తదితర సమస్యలను ఈఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఎఎస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

# పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలి

- భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి
- 28 వ తేదీలోపు మిగిలిన అన్ని సెంటర్లలో వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి
- ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నల్లగొండ బ్యూరో, మే 24 (వార్తా వేదిక సూర్య ) :** నకిరేకల్ ఎం.ఆర్.ఓ కార్యాలయం లో కేతపల్లి, నకిరేకల్, కట్టంగూర్ మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశం పై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు మండలాల్లో, మొత్తం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికి 23 సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 28 వ తేదీలోపు మిగిలిన అన్ని సెంటర్లలో వడ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత , మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల - మాధవ్ రెడ్డి , అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 7 వరోజు కొనసాగిన వివోఏల సమ్మె దీక్షలు

◆ వివోఏ సమస్యలు పరిష్కారం అయ్యేదాక పోరాటం కొనసాగిస్తాం

◆ వివోఏ జేఏసి జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష

**ఆత్మకూరు (ఎం), మే 24, (వార్త వేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల మహిళ సమాఖ్య కార్యాలయం ఎదుట మహిళ సంఘాలలో గ్రామ సంఘాలకు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వివోఏ లు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన సమ్మె 7 వరోజుకు చేరుకుంది. మండల కేంద్రం లోని మహిళ సమాఖ్య కార్యాలయం ఆదివారం 7 వ రోజు నిరసన దీక్ష లో వివోలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వివోఏ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష మాట్లాడుతూ వివోఏ లకు - కనీస వేతనం 20 చేయాలి. - ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి - సెర్ప్ ఉద్యోగులు గా గుర్తించాలి - అర్హులైన వివోఏలకు సీసీ లుగా ప్రమోషన్ ఇవ్వాలి - 58 జీవో ను సవరించి న్యాయం చేయాలి అని డిమాండ్ చేసారు. తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేసేదాకా పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

ఈ దీక్షల్లో వివోఏ జేఏసి నాయకులు మేడి రామ్ లక్ష్మణ్,వేముల నర్సింహ్మా,గొర్రెంకల నిర్మల, సుదగాని సూరమంభ, పోలేపాక భాగ్యమ్మ, కే శ్రీనివాస్, పి సునీతా, తుమ్మల సరిత,యాస మహేశ్వరీ, ప్రమీల, శ్యామల,లావణ్య,బూడిద సుచరిత, ఎం జయమ్మ, మౌనిక, ఉపేంద్ర, నాగరాణి తదితరులు కూర్చున్నారు



# వివాహ రీసెప్షన్‌లో పాల్గొని నూతన వదువరులకు శుభాకాంక్షలు

- తెలియచేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్



**దేవరకొండ మే 24, (వార్త వేదిక వార్త ):-** చింతపల్లి మండలం కేంద్రంలో సాయి సుమంగళి గార్డెన్ లో ఇద్దంపల్లి గ్రామానికి చెందిన జంతుక జగన్ శ్వేత వివాహ రెసెప్షన్ కార్యక్రమం లో పాల్గొని నూతన వదువరులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ గారితో పాటు ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర యాదగిరి, జంతుక విష్ణు, ముదిగొండ ఎల్లేష్,పొట్టేపాక మురళి కృష్ణ,కొమ్ము రాజశేఖర్,రవి,కొట్టెం శేఖర్, సైదులు,వెంకట్ తదితరులు పాలుగోన్నారు

# నియోజకవర్గంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కార్యక్రమాలు



**దేవరకొండ మే 24, ( వార్త వేదిక సూర్య ):-** 25 5 2026 సోమవారం రోజున ఉదయం 10:00గంటలకు దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే గారి నివాసం (వ్యవసాయ మార్కెట్ యార్డ్) లో కల్యాణలక్ష్మి మరియు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు. ఉదయం 11:00గంటలకు దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో ఆహార ధాన్యాల నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11:30గంటలకు దేవరకొండ మండలం వైదోనివంపు గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేస్తారు అని ఎమ్మెల్యే క్యాంప్ వర్గా లు తెలిపారు

# ఎలుక అంజయ్య కుటుంబ సభ్యుల ను పరామర్శించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్



**దేవరకొండ మే 24 ,(వార్త వేదిక సూర్య ):-** చందంపేట మండలంలోని రేకుల గడ్డ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ఇటీవల చనిపోయిన ఎలుక అంజయ్య కుటుంబ సభ్యులను నేడు వారి నివాసం లో పరామర్శించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ ఆయన వెంట స్థానిక సర్పంచ్ ఎలుక జలందర్ గౌడ్, కేతావత్ హరిలాల్ నాయక్, జగన్ గౌడ్, పెద్ద వెంకటయ్య గౌడ్, చిన్న వెంకటయ్య గౌడ్ , మల్లయ్య గౌడ్, వెంకటేశ్వర్లు , ఈశ్వర్, నేనావత్ నాగార్జున తదితరులు ఉన్నారు

# 26న ముదిరాజ్ సింహావలోకనం సదస్సు




**నల్లగొండ బ్యూరో, మే 24 (వార్తా వేదిక సూర్య ) :** ముదిరాజ్ విద్యా వంతుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26 న హైదరాబాద్ లో నిర్వహించే ముదిరాజ్ సింహావలోకనం సదస్సును, ముదిరాజ్ ల జీవన స్థితిగతులు, సమాజం పై పిట్టల రవీందర్ ముదిరాజ్ రాసిన పుస్తకం ఆవిష్కరణ ను విజయవంతం చేయాలని ముదిరాజ్ విద్యావంతుల వేదిక నాయకులు, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని డా.బీ. ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు, పుస్తకావిష్కరణ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ..ముదిరాజ్ సమాజ ప్రస్థానాన్ని, వాస్తవాలను అక్షరబద్ధం చేస్తూ పిట్టల రవీందర్ పుస్తకం రాశారని చెప్పారు. హైదరాబాద్లోని నెక్లెస్ రోడ్ లో ఉన్న జలవిహార్లో ఈ నెల 26 న మంగళవారం ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. ముదిరాజ్ జాతి స్థితిగతులను, వర్ధమాన, భవిష్యత్తులను కళ్ళకు కట్టే ఈ విలువైన గ్రంథ ఆవిష్కరణకు ముదిరాజ్ మేధావులు, యువత, పెద్దలు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సు పుస్తకావిష్కరణకు రాష్ట్ర మంత్రి వాకాటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారనీ చెప్పారు. ముదిరాజ్ విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేశబోయిన శంకర్ ముదిరాజ్, కట్ల సైదులు, మేఖల శ్రీహరి, సుదర్శన్, బాల్య, పిట్టల శంకర్, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడి వెల్లి మాజీ సర్పంచ్ లింగంని పరామర్శించిన బీ ఆర్ యస్ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్



**దేవరకొండ మే 24 ,(వార్త వేదిక సూర్య ):-** ఈ రోజు కొండమల్లె పల్లి మండలం గుమ్మడ వెల్లి బీ ఆ ర్ యస్ మాజీ సర్పంచ్ లింగ తండ్రి ఇటివలే మరణించారు వారి కుటుంబ సభ్యులకు బీ ఆర్ యస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ పరామర్శించారు. ఆయన వెంట గుమ్మడ వెల్లి ఉప సర్పంచ్ శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.



# రమావత్ వస్రాం మృతి చాల బాధాకరం కేతావత్ భిల్యా నాయక్



**దేవరకొండ మే 24,(వార్త వేదిక సూర్య ):-**చింతపల్లి మండల పరిధిలోని దేన్య తండా కు చెందిన రమావత్ వస్రాం మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ దేన్య తండా కు చేరుకోని వస్రాం పార్థివ దేహానికి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండల్ నాయక్, మాజీ ఎంపీటీసీ మంతు నాయక్, కేతావత్ శ్రీను నాయక్,పరమేష్ నాయక్, లాల్ సింగ్,భీమా,బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

# శివ నాయక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేతావత్ భిల్యా నాయక్



**దేరవకొండ మే 24, (వార్త వేదిక సూర్య ):-** చింతపల్లి మండల పరిధిలోని బోటిమిది తండా కు చెందిన బుల్లి తెర నటుడు ఫైటర్ గరుడ టీమ్ మెంబర్ నేనావత్ శివ నాయక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో స్థానిక మాజి సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, నేనావత్ జైపాల్ నాయక్, శ్రీను నాయక్,హరి నాయక్,సుమన్,బాస్కర్ నాయక్, నరేష్ నాయక్,గోవింద్,రాజ్ కుమార్,రాయుడు,దిలిప్, శివ తదితరులు పాల్గొన్నారు

# పశువులను తరలిస్తున్న డిసిఎం ను పోలీసులు పట్టివేత



**దేవరకొండ మే 24 , (వార్త వేదిక సూర్య ):-** తేదీ 24.05. 2026 రోజున కొండమల్లేపల్లి ఎస్సై తన సిబ్బందితో కొండమల్లేపల్లి గ్రామంలో వాహన తనిఖీ నిర్వహిస్తుండగా అందాజ సాయంత్రం 7:00 గంటల సమయంలో బొలెరో వాహనం యా08ఖ+ 8932 ను ఆపి చెక్ చేయగా అందులో ఆరు పశు వులు(మగ దూడలు) ఉన్నాయి వాటిని క్రూరంగా తాళ్లతో కట్టివేసి ఒకదాని ప్రక్కన ఒకటి కుక్కి, వాటికి ఎలాంటి ఆహారం నీరు అందించకుండా,కల్వకుర్తి కి మహమ్మద్ రియాజ్ తండ్రి అబ్దుల్ తీసుకెళ్తుండగా అతనిపై కేసు నమోదు చేసి పశువులను సంరక్షనార్ధం గోశాలకు పంపనైనది. అని కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీర రమేష్ తెలిపారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 2 సంచిక : 5
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి సోమవారం, మే 25, 2026

# మానసిక వికలాంగులకి మెరుగైన సేవలు అందించాలి

- సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత



**వలిగొండ, మే 24 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండల లీగల్ సర్వీస్ అథారిటీ రామన్నపేట ఆధ్వర్యంలో వలిగొండ మండలంలోని టేకుల సోమారం గ్రామంలో గల సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని రామన్నపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ మానసిక వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, వారికి అందిస్తున్న సేవలు సంరక్షణ విధానాలను పరిశీలించారు. వారికి నాణ్యతతో కూడిన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అనంతరం ఆశ్రమంలోని రిజిస్టర్లు, సంబంధిత డాక్యుమెంట్లు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జులు మీనాక్షి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.అలాగే వలిగొండలోని శాంతి నిలయం ఆశ్రమాన్ని కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి

- సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు



**మోత్కూరు, మే 24 ( వార్త వేదిక సూర్య):** పెట్రోల్, డీజిల్, సిజిఎస్ గ్యాస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అదివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమాషియాలో తలెత్తిన యుద్ధం మూలంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి, పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్రోల్ పై లీటరుకు రూ 3.14 పైసలు, డీజిల్ పై లీటరుకు రూ 3.11 పైసలు, సిజిఎస్ గ్యాస్ పై లీటరుకు 2 రూపాయలు పెంచడమే కాకుండా 8 రోజుల వ్యవదిలోనే మూడు సార్లు సగటున లీటరకు 90 పైసల చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సమంజసం కాదని అన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రజలపై పెట్రోల్, డీజిల్ భారం మోపిందన్నారు. గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని ప్రజలు అన్నట్లుగానే పెంచబోమని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం, 5 రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రజలపై బారాలు మోపడం దేశ ప్రజలను దగా చేయడమేనని విమర్శించారు.ఈ ధరల పెంపు రవాణా,వ్యవసాయ రంగాలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉందని, తక్షణమే పేర్కొన్నారు పెట్రోల్ ,డీజిల్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని,లేని యెడల సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.




## కల్వకోల్ అమీర్పేట్ రోడ్డు పనులు పరిశీలించిన

# ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ





**మహేశ్వరం మే 24 వార్త వేదిక సూర్య :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్పేట్ నుండి కల్వకోల్ కి వెళ్లే రోడ్డు పనులు పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ , మాజీ సర్పంచ్ తమాస్ రెడ్డి,

ఈ సందర్భంగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ని రోడ్డు పండ్లతో పాటు మా గ్రామ అభివృద్ధి కోసం మీ యొక్క సహకారం మాకు అందించాలని కోరారు .

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.మాజీ సర్పంచ్ తమాసి రెడ్డి , ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, బొజ్జం చంద్రయ్య, బక్కని రవి మాదిగ, పార్వతాయల్ గౌడ్, అరడి వెంకటేష్,గుర్రంపల్లి మల్లేష్,బక్కని అశోక్, జంపుల రాఘవేందర్, బక్కని రాజు, బక్కని సుమన్, ఆశపల్లి శంకరయ, బడుసు ప్రవీణ్, బొజ్జం కుమార్, అరడి రాఘవేందర్, కావలి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 15 ఏండ్ల తరువాత మళ్ళీ కలిసిన 2010-11 టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహం
- కాలం మారింది.. వయసు పెరిగింది.. కానీ 'స్నేహం' మాత్రం అక్కడే ఆగింది!



**మోటకొండూరు, మే 24 (వార్త వేధిక సూర్య):-** భూమి గుండ్రంగా ఉందో లేదో తెలియదు కానీ.. సరిగ్గా 15 ఏళ్ల క్రితం విడిపోయిన స్నేహాలు మాత్రం మళ్లీ ఒకే చోట కలిశాయి. మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం మానసా విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2010-11 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. మొదటగా బ్యాచ్ లో రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రులు కంది శశిధర్ రెడ్డి, రావుల నాగరాజు ల చిత్రపటాలకు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు విద్యార్థులంత కలిసి జ్యోతి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు.15 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత క్లాస్‌మేట్స్ అందరూ ఒకే వేదికపైకి రావడంతో స్కూల్ రోజులు మళ్లీ కళ్లముందు కదలాడాయి.ఈ సమ్మేళనంలో విశేషం ఏమిటంటే.. ఎవరి జీవితాల్లో వాళ్లు ఉద్యోగాలు, వ్యాపారాలు, పెళ్లిళ్లతో బిజీగా ఉండి, సమాజంలో రకరకాల హోదాల్లో ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం అవన్నీ పక్కన పెట్టేశారు. మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లిపోయి ఒకరినొకరు పేరు పేరునా పిలుచుకుంటూ.. ఆనాటి అల్లరి పనులు, క్లాస్ లీడర్ల గొడవలు, బెంచ్ వెనుక దాక్కుని తిన్న లంచ్ బాక్సుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ, ఈ స్నేహం జీవితాంతం ఇలాగే కొనసాగాలని మిత్రులందరూ ఒకరికొకరు హత్తుకుని ప్రతినబూనారు. గత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, ఏరా, ఒరేయ్ అనే పిలుపులతో మళ్ళీ చిన్న పిల్లలు గా మారిపోయి, జ్ఞాపకాల గుర్తుల కోసం సెల్ఫీలు దిగుతూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు.

ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, సినియర్ ఉపాధ్యాయులు సామ భూపాల్ రెడ్డి,బిఎంఆర్ఎస్ అధినేత బొప్పిడి మల్లారెడ్డి,కరస్పాండ్ రాఘవేందర్ రెడ్డి ,ఎండీ మధార్, వెంకటేశం, సంతోష్, ఆనంద్, లత,నిర్మల,పూర్వ విద్యార్థులు రమేష్ రెడ్డి,లింగస్వామి,

నాగరాజు, సతీష్,ఫయాజ్, సాయి, భగవాన్ రెడ్డి, నవీన్,పవన్,మదు, శశి, శ్రీకాంత్,లత,కల్యాణి, శ్రీలత,సోని, అఖిల, సౌజన్య,మౌనిక,శ్రీలత,తదితరులు పాల్గొన్నారు...

# కల్లు గీత వృత్తిలోకి కార్పొరేట్ శక్తుల ప్రవేశాన్ని సహించం

- గీత పనివారాల సంఘం జిల్లా అధ్యక్షులు



**మోత్కూరు, మే 24 (వార్త వేదిక సూర్య):** కల్లు గీత. వృత్తిలోకి కార్పొరేట్ శక్తుల ప్రవేశాన్ని సహించే ప్రసక్తే లేదని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య హెచ్చరించారు. ఆదివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ లాంటి ఫెస్టివల్స్ ను ప్రోత్సహించడం సరికాదన్నారు. కల్లుగీత సొసైటీ పర్యవేక్షణలోనే తాడి ఫెస్టివల్స్ నడవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తులు చేతుల్లోకి కల్లు గీత వృత్తి పోవడాన్ని ఊరుకోబోమన్నారు. 30 ఏళ్ల క్రితమే రామోజీరావు సంస్థలు కల్లుగీత సంస్థలు అడ్డుకట్ట వేసిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఆధునిక హంగులతో ఉన్న నందనం ముద్విన్ వంటి నీరా సేకరణ కేంద్రాలను విస్మరించి ప్రైవేట్ తాడి ఫెస్టివల్స్ ను ప్రభుత్వం ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కల్లుగీత వృత్తిదారులకు అండగా ఉండవల్సిన ప్రభుత్వం ఓ వ్యాపారి రాందేవ్ రావ్ నిర్వహించే తాటికల్లును ప్రోత్సహించడం తగదన్నారు. ప్రభుత్వ చర్య ధీటుగా తమ సంఘం ఆధ్వర్యంలో అతికొద్ది రోజుల్లోనే పండుథాళ్ల పండుగ చేపడతామన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో ఉద్యోగులు
ఏవరైనా రిటైర్డ్ అవుతున్నారా ! అయితే వారికి మీరు
శుభాకాంక్షలు తెలుపాలనుకుంటున్నారా
మా వార్త వేదిక సూర్య దినపత్రిక
ద్వారా తెలియజేయగలరు.
పూర్తి వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: 9985389183, 7386949183

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**